సాక్షి
చిత్తూరు
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

దక్షిణ కైలాసంగా పేరొందిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో



ఆధారాలు సేకరిస్తున్నాం

భవ్యశ్రీ మృతి కేసులో ఆధారాలను సేకరిస్తున్నట్లు పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	23
తిరుపతి	34	24
తిరుమల	29	21
గూడూరు	35	26
నగరి	35	25

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణను వినియోగించుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని నిరుద్యోగ యువత డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధికల్పన నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో మూడు నెలల పాటు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణత చెంది ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 15 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసున్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 15 లోపు కళాశాలలోని స్కిల్ హబ్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8919373147, 9160940479ను సంప్రదించాలని ఆయన కోరారు.

నాణ్యత లోపిస్తే చర్యలు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ విజయేంద్రరావు

గుడిపాల: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు అన్నారు. మండలంలోని కమ్మతిమ్మాపల్లె హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను మధ్యాహ్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతగా చేయాలని ఎక్కడైనా నాణ్యత లోపిస్తే అటువంటి వారిని వెంటనే తొలగిస్తామన్నారు. మన బడి- నాడు నేడు పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక, పీరియడ్ ప్లాన్, ఉపకరణాలతోనే బోధన చేయాలని సూచించారు. పాఠశాల క్రీడా మైదానంలో పిల్లలు క్రీడల్లో రాణిచ్చే విధంగా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు రామ్‌నాయక్, గణపతి ప్రధానోపాధ్యాయులు భానుప్రసాద్, సీఆర్‌పీ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 30 ఫిర్యాదులు



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: నగరంలో పోలీసుశాఖ నిర్వహించిన స్పందనకు 30 ఫిర్యాదులు అందాయి. ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, వేధింపులు, మోసం, పోలీసు సేవలు లాంటి సమస్యలు ఉన్నాయి. దీనిపై ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆయా స్టేషన్ ఎస్ఐలతో మాట్లాడారు. వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుపై వాస్తవాలను తెలుసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సుబ్రమణ్యస్వామి వారోత్సవాలు



విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామివారు

రామకుప్పం: భాద్రపద మాసంలో ప్రారంభమయ్యే శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారోత్సవాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, విశిష్ట అలంకరణ నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామిఅమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. నాగులపుట్టలో పాలుపోసిన అనంతరం మహిళలు మొక్కులను సమరిప్పించారు. కళ్లు, పడగలు, చెవుల ఆకారంలో ఉన్న వెండి కానుకలను స్వామివారి హుండీలో సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి దర్శనం కోసం క్యూలలో భక్తులు నిండిపోయారు. ఇనుప కొక్కీలను వీపునకు గుచ్చుకుని, నోటికి శూలాలు గుచ్చుకుని సుబ్రమణ్యస్వామి భక్తులు స్వామి వారికి కావడులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రథోత్సాహం

- వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- రథంపై ఊరేగిన వైకుంఠనాథుడు
- దేవదేవుని సేవలో తరించిన భక్తులు
- అశ్వవాహనంపై విహరిస్తూ కల్కి కటాక్షం
- నేడు చక్రస్నానం.. ధ్వజావరోహణం

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం ఉభయదేవేరీ సమేత మలయప్పస్వామివారికి అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మాడ వీధుల్లో భక్తులు గోవిందా... గోవిందా అంటూ మహారథాన్ని ఉత్సాహంగా ముందుకులాగారు. రథసేవలో దేవదేవుడిని దర్శించినవారికి ముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. స్వామివారు సోమవారం రాత్రి అశ్వవాహనంపై మలయప్ప కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం ఉదయం 3 గంటల నుంచి పల్లకి, తిరుచ్చి ఉత్సవాలు నిర్వహిస్తారు. శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారికి, చక్రతాళ్వారులకు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. చక్రతాళ్వారుకు పవిత్ర పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం అవుతాయి.

అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి భక్తులు ఆనందపరవశులయ్యారు. మహారథంపై కొలువైన తిరుమలేశుని దర్శించుకుని చరితార్థులయ్యారు. సాక్షాత్తు చతుర్ముఖుడే రథ సారథ్యం వహించిన అపురూప దృశ్యాన్ని మనోఫలకంలో నిక్షిప్తం చేసుకుని పులకించారు. అలంకార ప్రియుని అనంత తేజోవిరాట్ మూర్తిని సేవించుకుని పునీతులయ్యారు. తిరుగిరులు మార్మోగేలా గోవింద నామాలను స్మరిస్తూ తన్మయత్వం చెందారు. కల్కి అవతారంలో అశ్వరూఢుడై విహరిస్తున్న జగద్రక్షకుని ఎదుట పాహిమాం అంటూ మోకరిల్లారు. ముక్తిని ప్రసాదించమని దేవదేవుని మనఃపూర్వకంగా వేడుకుంటూ జన్మ సార్థకం చేసుకున్నారు.



అశ్వవాహనంపై కల్కి అవతారంలో శ్రీవారు



వాహనసేవలో అశ్వరాజులు



శ్రీవారి సేవలో వైవీ స్వర్ణలతమ్మ, జేఈవో సదాభార్గవి



శ్రీవారికి నమస్కరిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు



అశేష భక్తజన సందోహం నడుమ శ్రీవారి రథోత్సవం



శ్రీహరి వేషధారి



దేవతల వేషధారణలో కళాకారులు



కళాకారిణి నృత్య భంగిమ



శ్రీమహావిష్ణువు, ఆదిలక్ష్మి రూపంలో కళాకారులు



చిన్నికృష్ణుడు.. గోపికల అవతారంలో ప్రదర్శన

అంగరంగ వైభవం.. గణపయ్య రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పకడ్బందీగా పోలీసుల బందోబస్తు

కాణిపాకం(యాదమరి): జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన వరసిద్ధుని క్షేత్రంలో సోమవారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. పలు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చిన భక్త జనం గణేశ నామస్మరణతో రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. భక్తులతో కాణిపాకం వీధులు కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక అలంకరణలో రథంపై కొలువుదీరిన వరసిద్ధి వినాయక స్వామి పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకుముందు ఉభయదారుల ఆధ్వర్యంలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం చేసి పూజలు చేసి దర్శనం కల్పించారు. అనంతరం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు చేసి సుగంధ పుష్పాలతో అలకరించి పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించి గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఏఈఓ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఉభయదారులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కదిలిన స్వామివారి రథం

కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం అశ్వాలు, ద్వారపాలకులను, పుష్పాలను స్వామి రథానికి అలంకరించారు. అనంతరం పుణ్యాహవచనం, వాస్తు, రథసారథి ప్రతిష్ట, రథబలి, కూష్మాండ బలి, పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయ అధికారులు, ఉభయదారులు భుజాలపై మోసుకుంటూ వచ్చి రథంలో కొలువుదీర్చారు. ఉదయం 9 గంటలకు సంప్రదాయబద్ధంగా కొద్ది దూరం లాగారు. స్వామివారి రథం ముందు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం రథంపై ఆశీనులైన సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి మధ్యాహ్నం 2 గంటలకు ముందుకు కదిలారు. అప్పుడు తేలికపాటి వర్షం ప్రారంభమైంది. అయినా భక్తులు లెక్క చేయకుండా స్వామివారి నామస్మరణ మధ్య రథాన్ని ముందుకు కదిలించారు. మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో, లంబాడీ, కళాకారుల నృత్యాల మధ్య రథం ముందుకు సాగింది. భక్తులు రథంపై మిరియాలు, బొరుగులు చల్లి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు బాబు, ఉభయదారులు కీర్తిశేషులు ఎత్తిరాజుల నాయుడు కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి మీనాకుమారి, ఎన్ శివప్రసాద్ నాయుడు, కె.పూర్ణచంద్రారెడ్డి మాజీ పీఎం కాణిపాకం, చంద్రశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు హరిప్రసాద్ రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.



అశేష భక్తజనం మధ్య కదులుతున్న స్వామివారి రథం (ఇన్‌సెట్) రథంలో కొలువుదీరిన స్వామివారు

నేడు స్వామివారి కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం బిక్షాండి కార్యక్రమం, అనంతరం స్వామివారి కల్యాణం, రాత్రి అశ్వవాహనంపై ఉత్సవమూర్తులు ఊరేగనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

భారీ బందోబస్తు

స్వామివారి రథోత్సవం సందర్భంగా బుధవారం చిత్తూరు అడిషనల్ ఎస్పీ సుధాకర్ చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. అనంతరం రథం ఊరేగింపులో తనిఖీలు చేశారు. ఆలయం వద్ద అనుమానిత వ్యక్తులను గుర్తించడానికి డ్రోన్‌లతో తనిఖీలు చేశారు.







రథం లాగుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, అధికారులు, రథం ముందు కేరళ కళాకారుల కోలాటం, రథోత్సవంలో అశ్వాలపై కళాకారుల ప్రదర్శన

మైమరిపిం'చేను'



మండలంలోని చిక్కపల్లి తండా సమీపంలోని అటవీ పరిధిలో ఉన్న చెలిమిచేను జలపాతం చూపరులను మైమరిపిస్తోంది. నాలుగు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు వంకలు, వాగులు, చెరువులు నిండిపోయాయి. దీంతో చెలిమిచేను జలపాతంలో నీరు పైనున్న కొండ నుంచి జాలువారుతోంది. ఈ అందమైన జలపాత దృశ్యాలను చూడటానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక్కడ జాగ్రత్తగా లేకపోతే ప్రమాదం తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

– రామకుప్పం

రెజ్లింగ్‌లో తిరుమలయ్యపల్లె విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో విజేతలు

వెదురుకుప్పం: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని తిరుమలయ్యపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల తమ పాఠశాలకు చెందిన రేశ్వంత్‌కుమార్, దీక్షారెడ్డి ఇటీవల కృష్ణా జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అండర్ -14 బాలుర 48 కిలోల విభాగంలో రేశ్వంత్ కుమార్ వెండి పతకం, అండర్-17 బాలికల 57 కిలోల విభాగంలో వై.దీక్షారెడ్డి రజతం పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ ద్వారా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో గుర్తింపు తెచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు


ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు


పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, వేద పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో ఐదు రోజులపాటు వీటిని నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. నిత్య పూజల్లో తెలిసో, తెలియకో జరిగే దోషాల నివారణకు ప్రతి ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. తొలిరోజు ఆలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్, వేద పండితులు పూజలు చేశారు. యాగశాల వద్ద వేదిక వద్ద రంగు రంగుల ముగ్గులు వేసి, యాగశాల గోడలకు నట రాజస్వామి ప్రతిమను చిత్రించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య వేదికమీద కలశస్థాపన చేసి హోమం చేశారు. దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవమూర్తులు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి, వివిధ రకాల పూజ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. విశిష్ట అలంకారాలు చేశారు. ధూప దీప నైవేద్యాలు నివేదించి, పూర్ణ హారతులు సమర్పించారు.

దేవతల పునరుత్తేజం కోసమే పవిత్రోత్సవాలు

అంజూరు మాట్లాడుతూ, ఆలయంలో మూలవిరాట్టులకు పునరుత్తేజం కోసం ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతాలన్నీ సస్యశ్యామలంగా ఉండాలని, భక్తులకు దేవతామూర్తుల ఆశీస్సులు లభించి, వారి కోర్కెలు ఫలించాలని, దేవదేవుని ఆశీస్సులు లభించాలని సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వాణి, బియ్యపు పవిత్రా రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, పసలు సుమతి ప్రత్యేక ఆహ్వానితులు, శ్రీదేవి, దేవస్థాన ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, దేవస్థాన అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నం,డిప్యూటీ ఈఓ జే.వెంకటసుబ్బయ్య, ఏఈఓ ధనపాల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ నాయుడు, వేద పండితులు ప్రభాకర్ శర్మ, హేమంత్ కుమార్, ఆలయ అర్చకులు శ్రీనివాసన్ గురుకుల్, పరిచారకులు గోవింద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలను సేకరిస్తున్నాం

పెనుమూరు (కార్వేటినగరం): అనుమానాస్పదంగా మృతి చెందిన భవ్యశ్రీ (16) మృతికి గల ఆధారాలను సేకరిస్తున్నామని, ఆమె మృతికి కారకులైన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. భవ్యశ్రీ మృతదేహం లభించిన బావిలోని నీటిని సోమవారం తోడేసి, ఆమె జడతో కూడిన వెంట్రుకలను వెలికి తీశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ భవ్యశ్రీ తలవెంట్రుకలు కుచ్చుగా ఊడి వచ్చినట్లున్నాయని, వీటిని కూడా పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపి, శవ పరీక్ష కోసం అనుమానంతో పంపిన అవయవాల పరీక్ష ఫలితాలు వచ్చిన వెంటనే దర్యాప్తును వేగవంతం చేస్తామని, ఇతర వివరాలను ఫలితాల అనంతరం పోలీస్ ఉన్నత అధికారులు మీడియా ముందు వెల్లడిస్తారని ఎస్ఐ పేర్కొన్నారు.

రేపు పుత్తూరులో జాబ్ మేళా

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కెమిస్ట్రీ విభాగం, కాంచీపురానికి చెందిన బయోసైన్స్ రీసర్చ్ ఫౌండేషన్ సంస్థ సంయుక్తంగా ఈనెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ జువాలజీ పూర్తి చేసిన వారు, ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. వివరాలకు 88013 25220కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

మలిశెట్టి కథల పోటీలు-2023 విజేతల ఎంపిక

పలమనేరు: జాతీయ స్థాయి మలిశెట్టి సీతారామ్ స్మారక కథల పోటీల్లో విజేతల వివరాలను పలమనేరుకు చెందిన ఎమ్మెస్సార్ ట్రస్ట్ నిర్వాహకులు శ్యాంప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ ట్రస్ట్ ఏటా జాతీయ స్థాయిలో నిర్వహించే కథల పోటీల్లో భాగంగా 2023 ఏడాదికి సంబంధించి ఆరు రాష్ట్రాలనుంచి 197 కథలు వచ్చినట్టు ఆయన తెలిపారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి, కుమారస్వామి రెడ్డి వీటిని మూడు వడపోతల అనంతరం నాలుగు అత్యుత్తమ కథలను ఎంపిక చేశారని తెలిపారు. ఎంపికైన కథల్లో హైదరాబాద్‌కు చెందిన దేశరాజి కథ 'తల్లికూతురు మధ్యలో ఆమె' రూ.5వేల ప్రథమ బహుమతి, కార్వేటినగరానికి చెందిన మూరిశెట్టి గోవింద్ కథ 'ఉన్నోడు లేనోడు' రెండో బహుమతిగా రూ.3వేలు, నిజామాబాద్‌కు చెందిన కళా గోపాల్ కథ 'వేకువ నక్షత్రం' మూడో బహుమతిగా రూ.2వేలు, పూణేకు చెందిన గాయత్రి కథ 'కప్పుతేనీరు' నాలుగో బహుమతిగా రూ.వెయ్యిగా ఎంపికైనట్లు తెలిపారు. ఇవి కాకుండా ఉత్తమ కథలుగా నిప్పురవ్వలు(విజయలక్ష్మి-హైదరాబాద్), ఆనవాళ్లు(సింహప్రసాద్, హైదరాబాద్), పదమూడేళ్ల వయసు(రాధా హిమబిందు-హైదరాబాద్), అమ్మా నీ వేలు పట్టుకో(ఉషాబాల-వరంగల్), పరీక్ష(ఆముదాల మురళి- తిరుపతి), పశ్చిమ తీరాన పసిడి కుసుమం(కొప్పిశెట్టి-హైదరాబాద్), ద్వంద్వ సమాసం (రాధాక్రిష్ణ- చీరాల), కలకానిది(వియోగి-కర్నూలు), పేగుబంధం(హైమా- బెంగళూరు), అనపకుంట(వినాయకం- పీలేరు), ఊరుమ నదిరో(కృష్ణస్వామి రాజు- తిరుపతి), మోళి (సువర్ణ- బెంగళూరు), గోనోడు (రాజ్‌కుమార్-వరంగల్), దేవీకక్క(విజయకుమారి- తిరుపతి), నల్లకవరు(చంద్రశేఖర్- హైదరాబాద్), ప్రాణి(సూర్యనారాయణ- హైదరాబాద్) ఎంపికై నట్టు తెలిపారు. మొత్తం ఇరవై కథలను కలిపి కథా ప్రపంచం 2023లో ప్రచురించనున్నట్టు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన 20మంది రచయితలకు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో నగదు బహుమతులు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు పైలెట్ హెల్త్ క్యాంపు

చిత్తూరు రూరల్/తిరుపతి తుడా: జిల్లాలో ఆరోగ్య సురక్ష సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ట్రయల్ రన్ చేపడుతోంది. పైలెట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మోజీపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెల్త్ క్యాంపును నిర్వహించనుంది. తిరుపతి రూరల్‌లోని దామినేడు పీహెచ్‌సీ మల్లవరం పీహెచ్‌సీలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నారు. దీనికి అవసరమైన మందులు తదితర అన్ని ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆరోగ్య శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్స పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంచారు. ఆరోగ్య శిబిరానికి విలేజ్ క్లినిక్ సిబ్బంది, పీహెచ్‌సీ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టులు హాజరు కానున్నారు.

ఎన్‌హెచ్‌ఎంలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: ఎన్‌హెచ్‌ఎంలో పలు ఖాళీలను అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు 11, స్టాఫ్ నర్సు 31, ఫిజియోథెరపిస్ట్ 1, మల్టీ రెహబిలేషన్ వర్కర్ 3, ల్యాబ్ టెక్నీషియన్ 4, ఫార్మసిస్ట్ 2, లాస్ట్ గ్రేడ్ 1, డేటా మేనేజర్ 1 చొప్పున ఖాళీలున్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు www.chittoor.ap.gov.inలో చూసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఈనెల 30వతేదీలోపు స్వీకరణ ముగుస్తుందని ఆమె పేర్కొన్నారు.

అటవీ పనులపై సమీక్ష


సమీక్షిస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అటవీశాఖ పరిధిలో జరుగుతున్న పనులపై డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి రేంజర్లతో సోమవారం డీఎఫ్ఓ కార్యాలయంలో సమీక్షించారు. కంప, ఎర్రచందనం రక్షణ పథకం కింద వచ్చిన నిధులు చేపట్టిన పనుల గురించి మాట్లాడారు. చిత్తూరు సంతపేటలో నిర్మిస్తున్న నగరవనానికి ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు నిధులు వచ్చాయని, మరో రూ.60 లక్షలు రావాల్సి ఉందన్నారు. చిత్తూరు ఈస్ట్ నగరవనం రూ.2.75 లక్షలు, పిల్లల పార్కును రూ.6.08 లక్షల చొప్పున ఏడాదికి లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్‌లోపు వాటిని ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. కుప్పం, కార్వేటినగరం నగర వనాల నిర్మాణాలకు రూ.2.80 కోట్లు నిధులు వచ్చాయన్నారు. అక్కడ పనులు త్వరగా చేయాలని సూచించారు. కోర్టు కేసులు ఫైలింగ్ అంశాలపై మాట్లాడారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రక్షణ విభాగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రేంజర్లు బాలకృష్ణారెడ్డి, థామస్, వెంకటసుబ్బయ్య, శివన్న తదితరులు పాల్గొన్నారు.

నేటమ్స్ చెరుకు రైతులకు త్వరలో తీపికబురు

నగరి : గత ప్రభుత్వ పెద్దలు చేసిన పాపం.. నిండ్ర మండలంలోని నేటమ్స్ షుగర్స్‌కు చెందిన చెరుకు రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని రైతులతోపాటు సమీప మండలాలైన నగరి, విజయపురం, పిచ్చాటూరు, నాగలాపురం, పుత్తూరు మండలాలకు చెందిన చెరుకు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ ఫ్యాక్టరీ టీడీపీ ప్రభుత్వ పాలన చివరి దశలో ఉండగా ఈ ఫ్యాక్టరీ మూతబడింది. అప్పటికే చెరుకును క్రషింగ్‌కు తరలించిన రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా ఫ్యాక్టరీ బకాయి ఉంచింది. అప్పటి నుంచి బకాయిల కోసం రైతులు పోరాడుతూనే ఉన్నారు. అయినా ఫ్యాక్టరీ నిర్వాహకులు పట్టించుకున్న పాపానపోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మంత్రి ఆర్కేరోజా ఫ్యాక్టరీ నిర్వాహకులతో బకాయిల చెల్లింపు నిమిత్తం చర్చలు జరిపారు. ఈ చర్చల్లో తాము రైతుల బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం మాటతప్పి కోర్టును ఆశ్రయించింది. దీంతో బకాయిల చెల్లింపు ప్రక్రియ జాప్యమవుతూ వచ్చింది. ఈ దశలో మంత్రి ఆర్కేరోజా నగరి పర్యటనకు ముఖ్యమంత్రి విచ్చేసిన సందర్భంలో ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు న్యాయం చేయాలని మంత్రి కోరారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌కు వెంటనే రైతుల సమస్యను పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లా యంత్రాంగం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. మూతబడిన ఫ్యాక్టరీని వేలం వేయడంద్వారా వచ్చే ఆదాయంతో బకాయిల చెల్లింపునకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే రెవెన్యూ అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీచేశారు. అక్టోబరు 7వ తేదీ వరకు చివరి గడువు ఇస్తూ ఫైనల్ నోటీసు అందించినట్లు నిండ్ర తహసీల్దార్ తెలిపారు. బకాయి ఉన్న చెరుకు రైతుల తరపున కొందరు నాయకులు త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు.

స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించండి


వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో నమోదయ్యే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం స్పందన నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు స్పందనలో వినతులు అందజేశారు. డీఆర్‌వో మాట్లాడుతూ స్పందనలో నమోదయ్యే వినతుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. వివిధ శాఖలకు సంబంధించి 369 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలు రీ-ఓపెన్ కాకుండా చర్యలు

జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. పలు శాఖల అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డీఆర్‌వో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న కు చెబుదాం, స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి అధికారులందరూ ప్రత్యేక దృష్టితో పనిచేయాలన్నారు. అనంతరం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదైన అర్జీల పురోగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ భవాని పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయానికి 2.5 ఎకరాలు కేటాయింపు


పత్రాలను ఎంవీఐ సుప్రియకు అందజేస్తున్న ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: పుంగనూరులో రవాణాశాఖ కార్యాలయం నిర్మించేందుకు రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోట్లాది రూపాయలు విలువ చేసే 2.5 ఎకరాల భూమిని కేటాయించారని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, తహసీల్దార్ సీతారామన్‌తో కలసి భూమి కేటాయింపు పత్రాలను ఎంవీఐ సుప్రియకు సోమవారం అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ ఆర్టీవో కార్యాలయానికి బైపాస్‌రోడ్డులోని రాగానిపల్లె వద్ద 2.5 ఎకరాల భూమిని కేటాయించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఎంవీఐ సుప్రియ కలసి గత నెలలో కోరినట్లు తెలిపారు. వారి కోరిక మేరకు బైపాస్‌రోడ్డులో 2.5 ఎకరాల భూమిని కేటాయించినట్లు వివరించారు. త్వరలోనే ఆ ప్రాంతంలో పక్కా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గోవిందమాల భక్తుడు మృతి

పుత్తూరు రూరల్: కారు ఢీకొని గోవిందమాల భక్తుడు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు, తమిళనాడులోని కాంచీపురం జిల్లా, జలడియన్ పేటకు చెందిన డీకే మణి(58), భార్య సుమతితో కలిసి గోవిందమాల ధారణతో తిరుమలకు కాలినడకన బయల్దేరారు. తిరుపతి వైపు వెళుతున్న కారు వెనక నుంచి ఢీకొనడంతో మణి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటే కారణం.. బాబుకు బెయిల్ రానందుకు కాదు

- టీడీపీ నాయకుల శవ రాజకీయాలు
- వారి ప్రచారంపై మండిపడుతున్న ప్రజలు

పెద్దపంజాణి: గుండెపోటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందితే.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు బెయిల్ రాలేదన్న మనస్తాపంతో చనిపోయాడంటూ టీడీపీ నాయకులు ప్రచారానికి తెగబడ్డారు. సహజ మరణాలను ఎప్పటిలాగే టీడీపీ సానుభూతి కోసం తన ఖాతాలో వేసుకుందంటూ ప్రజలు నవ్వుకున్నారు. స్థానికుల కథనం మేరకు..మండలంలోని శివాడీ గ్రామానికి చెందిన సుందరరాజు కుమారుడు కనకరాజు(46) కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. దీనికి తోడు గుండెపోటు రావడంతో సోమవారం మృతి చెందాడు. అయితే సహజ మరణాన్ని కూడా టీడీపీ నాయకులు శవ రాజకీయాలకు వాడుకోవడంతో విమర్శల పాలయ్యారు.

ఆర్మీ సెలెక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా


ఆర్మీ సెలెక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: గుంటూరులో ఈనెల 24న నిర్వహించిన ఆర్మీ సెలెక్షన్స్‌లో తిరుపతి ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించినట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతిలోని అకాడమీలో ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికై నట్లు తెలిపారు. టెక్నికల్-17, జీడీ-66, ట్రేడ్స్‌మెన్-2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయినట్లు చెప్పారు. అకాడమీలో విద్యతో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అకాడమీలో ఉచిత విద్యను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.